# ఇండియాలో అయితే.....

కొవ్వలి (కాటూరి) జ్యోతి, Toronto, Canada

'ఢాం' అంటూ ఆటంబాంబు పేలిన చప్పుడికి ఉలిక్కిపడి లేచాను. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా చిన్నన్నయ్య మళ్ళీ గెలిచాడు. ప్రతి ఏడూ నన్ను ఉడుకించి, నాతో పోటీ పెట్టుకుంటాడు. దీపావళినాడు ఎవరు తెల్లవారకముందే లేస్తారో అని. నేను ఎంత ప్రయత్నం చేసినా ప్రతిఏడూ నాకంటే ముందరే లేచి నేను పడుకునే కిటికీ ప్రక్కనే బయట ఒక టపాకాయ పేల్చి నన్ను నిద్ర లేపుతాడు మా విజయన్నయ్య. ఎట్లాగూ గెలుపు వాడిదే కాబట్టి 'వాడి వెక్కిరింతలు కూడా ఎక్కడ పడతాను' అనుకుని బద్ధకంగా మళ్ళీ ముసుగు తన్నాను నేను. 'ట్రింగ్ ట్రింగ్' మంటూ మోత. ఇదేమిటి ఈ శబ్దం! కొత్త రకం టపాకాయా? అనుకుంటూ మంచంమీదే మళ్ళీ దొర్లాను. మోత ఆగటం లేదు. విసుగ్గా లేచి కూర్చున్నాను కళ్ళు నులుముకుంటూ. చుట్టూ చీకటి, ప్రక్కనే అలారం మోత. పూర్తిగా మొలకువ వచ్చింది. నేను నిద్ర లేచింది టొరంటో మహానగరంలోనని, ఇంతసేపూ దీపావళి గురించి తియ్యని కలలు కంటున్నానని అర్థమయింది. పెద్ద నిట్టూర్పుతో మంచం మీదనుంచి అతి ప్రయాసతో, విసుగుతో లేచాను. చీకటి. చలి...నిజం ఈనాడు దీపావళే...కానీ ఇక్కడేం దీపావళి... '

మెత్తటి బాత్‌రూం చెప్పులలో పాదాలు దూర్చి కాళ్ళీడ్చుకుంటూ కిందకి దిగాను. కాఫీ మెషీన్ ఆన్ చేస్తూ ఊహల్లో మళ్ళీ ఇండియాకి వెళ్ళిపోయాను. చిన్నప్పుడు ఈ పాటికి అమ్మమ్మ, అమ్మ హడావిడిగా మాకందరికి తలంటి స్నానాలు చేయిస్తుండేవారు. బాయిలర్‌లో బొగ్గులకి నిప్పంటించి, వేడిగా నీళ్ళు కాచి, కళ్ళలోకి కుంకుడురసం పోకుండా జాగ్రత్త పడుతూ, కథలూ ఖబుర్లూ చెపుతూ మా అమ్మమ్మ నీళ్ళుపోస్తుంటే నిద్రమత్తు పూర్తిగా వదిలి దీపావళి సంరంభం ఆరంభం అయ్యేది. ఒక చేతిలో కాఫీ కప్పు, ఇంకొకచేతిలో ఆరోజు న్యూస్‌పేపరు తీసుకుని మేడమీదకి వెళ్ళి శ్రీవారికి సుప్రభాతం పలికాను. నెమ్మదిగా 'హాపీ దీపావళి' అని గొణిగాను. 'హాపీ మార్నింగ్' నిద్ర మత్తులోంచి శ్రీవారి జవాబు. తమ బాత్‌రూంలోకి దూరారు. నేను మరొక బాత్‌రూంలోకి దూరి షాంపూతో తలకి స్నానం చేసి రోజూ వేసుకునే యూనిఫాం — అంటే జీన్స్, స్వెట్ షర్ట్ — వేసుకుని బాబ్‌డ్ హెయిర్‌ని మూడు నిమిషాలలో హెయిర్‌డ్రయ్యర్ సహాయంతో స్టైల్ చేసుకుని, ముఖానికి పవుడర్ అద్దుకుని బయట పడ్డాను. ఇండియాలో అయితే ఈ పాటికి అమ్మ, నడుముకిందకి వచ్చే ఒత్తైన నా జుట్టుకి సాంబ్రాణి పొగ పట్టించి , ఓపికగా చిక్కు ముడులు విప్పి, అందంగా తల దువ్వి, బోలెడన్ని పూలు పెట్టి దీపావళికి కొన్న పట్టు పరికిణీ వేసి స్నేహితులందరికీ వెళ్ళి చూపించు అని పంపేవారు.

ఆలోచనల మధ్య అప్రయత్నంగానే శ్రీవారికి టోస్ట్, మధ్యాహ్నానికి సాండ్‌విచ్ తయారుచేశాను. 6.30 కల్లా శ్రీవారు సూటు, బూటు తగిలించుకు కిందకి దిగారు. పది నిముషాలలో బ్రేక్‌ఫాస్ట్ ముగించి. బయలుదేరారు ఆఫీసుకి. 'హాపీ దీపావళి' అన్నన్నాను మళ్ళీ. 'సీ యూ లేటర్' అంటూ వెళ్ళి పోయారు. ప్రొద్దున్నపూట ఏం మాట్లాడినా ఆయన బుర్రలోకి దూరదు. నిట్టూరుస్తూ తలుపులు వేసుకుని ఇంట్లోకి వెళ్ళాను.

దైనందిన కార్యక్రమంలో తరువాతి మెట్టు పిల్లల్ని స్కూలికి తయారు చెయ్యటం. ముందర పెద్దవాడి రూములోకి వెళ్ళి 'అనిల్ టైమయింది లే నాన్నా' అంటూనే కూతురి రూములోకి వెళ్ళి ' చిన్ని తల్లీ వేకప్ టైం' అన్నా. ఇద్దరూ కదలటం లేదు. రెండు గదులమధ్య అలా పది నిముషాలు నడిచాను. ఇండియాలో అయితేనా టపాకాయల మోతకి ఈ పాటికి ఊళ్ళో అన్ని మంచాలూ ఖాళీ అయి వుండేవి. మొత్తంమీద ఎలాగయితేనేం ఇద్దర్నీ లేపి చెరో బాత్‌రూంలోకి తరిమాను. ఇక రెండు బాత్‌రూంల మధ్య నా భరతనాట్యం మొదలయింది. కొడుక్కి టూత్‌పేస్టు తప్పు flavourది ఇచ్చానుట, కూతురికేమో pink టవల్ ఇవ్వలేదుట. పండగపూట దెబ్బలు కొట్టడం ఇష్టంలేక ఎక్కడలేని సహనాన్ని నాకు నేనే కల్పించుకుని ఇద్దర్నీ చెరొక బాత్ టబ్‌లోకి చేర్చాను. 'ఇవ్వాళ దీపావళి' అంటూ ఇద్దరికీ పొద్దున్నే షాంపూతో తలంటి పోసాను. ఇద్దరూ ఒకటే గొడవ 'చలి వేస్తోంది, పొద్దున్నే తలంటి ఏమిటి?' అని. ఇద్దరికీ 'ఇండియాలో అయితేనా... ' అంటూ ఒక లెక్చరు దంచుతూ, కొత్త బట్టలు తొడిగాను. మూడు నెలలకి ఒకసారి సీసన్ మారినప్పుడల్లా winter clothes, summer clothesటు అంటూ రకరకాల బట్టలు కొంటూనే ఉంటాం. అందువల్ల కొత్త బట్టలు వేసుకున్నప్పుడు చిన్నప్పుడు నాకున్న మజా వీళ్ళలో కనిపించదు. మళ్ళీ పెద్ద నిట్టూర్పు వెడలింది నానించి. ఇద్దరూ తయారయి కిందకి దిగి ఫామిలీ రూంలో వున్న T.V. ముందర చేరారు. 'నాకు care bear showనే కావాలి' కూతురు అరుపు. 'వీల్లేదు Star Trekతప్ప వేరే చూడను' కొడుకు సమాధానం. 'ఇదిగో ఇద్దరూ ఏదోలాగ మీ problemని solve చేసుకోపోతే నేను News channelకి మార్చేస్తాను,' నా బెదిరింపు. ఇద్దరూ గప్‌చిప్‌గా 'Ninja Turtles' చూడటం మొదలు పెట్టారు. ఇద్దరికీ చెరో కప్పులో cereal ఇచ్చి, ఇంకొక కప్పు నాకోసం నింపుకుని, కిచెన్ టేబిల్ దగ్గర పేపరుతో సహా కూర్చున్నాను. పేపరు మీద మనసు లగ్నం కావటంలేదు. ఆలోచనలు మళ్ళీ ఇండియా వైపుకి మళ్ళాయి. ఈ పాటికి టపాకాయలు కాల్చి అందరం ఆకలితో వంటఇంటి వైపుకి వెళ్ళేవాళ్ళం. ముందర తియ్యటి లడ్డూ తినిపించి, కమ్మటి టిఫిన్ పెట్టేవారు అమ్మ. చకచకా తినేసి అక్కయ్యతోపాటు బయల్దేరేదాన్ని చుట్టుపక్కల ఉన్న అందరిళ్ళకీ ఫలహారాలు పంచి, వాళ్ళకి శుభాకాంక్షలు తెలిపేందుకు. అదిగో అప్పుడే జరిగేవి కొత్తచీరలు, నగల గురించి బేరీజులు, భేషజాలు. అదీ ఒక సరదానే.

ఆలోచనల మధ్య టైం చూసుకోలేదు. 8.15 అయిపోయింది. పిల్లలిద్దర్నీ టి.వి. ముందర్నించి లేపి, షూస్, కోట్లు వేయించి కారులోకి ఎక్కించాను. కారి ఆన్ చేసి హీట్ ఎక్కువ చేసాను. 'ఇదెక్కడ చలో బాబు, ప్రాణం తీస్తోంది' రోజూ అనుకునే హాటే 'ఇంకా అప్పుడే, ఫిబ్రవరి కాదుగా ఇది. ముందున్నది ముసళ్ళ పండుగ.' నాకు నేనే చెప్పుకునే సమాధానం. కారు మా రోడ్డు దాటి మెయిన్ రోడ్డు మీదికి చేరింది. ఇవ్వాళ 10 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరేసరికి ట్రాఫిక్ రష్‌లో ఇరుక్కుపోయాను. కారుని అతి నెమ్మదిగా ముందరికి జరుపుతున్నాను. ఏమయినా సరే ఇండియా గురించిన ఆలోచనల్ని ప్రక్కకి నెట్టి కారుని జాగ్రత్తగా నడపకపోతే...అమ్మో! ఇంకేమయినా వుందా. మొత్తానికి పిల్లల్ని 15 నిమిషాలు లేటుగా స్కూల్లో దింపి, దార్లో డ్రైక్లీనర్స్ వద్ద శ్రీవారి సూటు తీసుకుని, bank teller దగ్గర ఆ నెలకి కట్టవలసిన బిల్స్ అన్నీ కట్టేసి ఇంటికి చేరే సరికి 11 గంటలయింది. చకచకా వంటగది, పూజగది సర్దుకుని, ఫామిలీ రూంలో క్రితం రాత్రి వదిలిన పుస్తకాలు, బొమ్మలు అన్నీ ఏరుకుని మేడమీదకి వెళ్ళాను.

ఇండియాలో ఈ పాటికి నేనూ నా స్నేహితులు చేరి ఆ రాత్రికి ఎవరెవరం ఏమేం టపాకాయలు కాలుస్తాం, ఎవరింటి ముందర పేలిన టపాకాయల చెత్త ఎక్కువగా చేరుతుంది వంటి విషయాలపై పోటీలు వేసుకునేవాళ్ళం. నేను మా ఇంట్లో ఆఖరిదాన్నిని కావటంవల్ల అన్నయ్యలందరూ వాళ్ళ టపాకాయలన్నీ కూడా నాచేతే కాల్పించేవారు. నా స్నేహితురాలు రమ ఇంట్లోమటుకూ అయిదుగురు పిల్లలూ చిన్నవాళ్ళే కావటం మూలాన వాళ్ళు టపాకాయలు పంచుకుంటూ, కీచులాడుకుంటూంటే వాళ్ళ అమ్మ అనేది కదా, 'మీరు పెద్దవాళ్ళయి ఆస్తులు పంచుకునేటప్పుడు ఏం చేస్తార్రా అని.

ఆలోచనల మధ్య అన్ని గదుల్లోనూ పక్కలు సర్ది, బట్టలమూట తీసుకుని లాండ్రీరూంలోకి దారి తీసాను. ఇండియాలో అయితే ఈ పాటికి పనిమనిషి వచ్చి ఇల్లంతా శుభ్రంచేసి, బట్టలన్నీ ఉతికి ఆరేసి, అమ్మ ఇచ్చిన ఫలహారాలన్నీ తీసుకుని దాని ఇంట్లో దీపావళి జరుపుకునేందుకు వెళ్ళేది. ప్రతి దీపావళికి అమ్మ దానికి కూడా చీర కొని ఇచ్చేవారు. సాయంత్రానికి అది కూడా తలంటుకుని, కొత్త చీర కట్టుకుని మళ్ళీ పనికి వచ్చేది.

అదిగో అప్పుడే 11.45 అయింది. పిల్లలకి లంచ్ టైం వస్తోంది. మళ్ళీ కార్లో బయల్దేరాను. తిరిగి వస్తున్నప్పుడు అడిగాను లంచ్ కి ఏం కావాలని. 'పిట్జా', ఇద్దరూ ఒకేసారి సమాధానం ఇచ్చారు. ఇద్దరూ ముక్త కంఠంతో పలికే పలుకులు చాలా అరుదుసుమండీ మా ఇంట్లో. రెడిమేడ్ షెల్స్(shells) మీద రెడిమేడ్ టొమేటో సాస్ వేసి, పైన చీస్(cheese) చల్లి మైక్రోవేవ్ లో రెండు నిమిషాలుంచి వాళ్ళకి పెట్టాను. పండగ పూట వాళ్ళకి ఇటాలియన్ భోజనం పెట్టినా నేను మటుకు ఫ్రీజర్ లో ఉన్న చపాతీలు వేడిచేసుకుని, క్రితం రాత్రి వండిన కూర నంచుకుని తినేసాను. మళ్ళీ ఇండియా జ్ఞాపకం వచ్చింది. ఫ్రిజ్ లోంచి ఆవకాయ, గోంగూర వేసుకుని మరొక చపాతీలో నంచుకుని తిన్నాను. అదీ పండగపూట చద్ది భోజనం. మళ్ళీ పిల్లల్ని స్కూల్లో దింపి హమ్మయ్య అనుకుని. ఊపిరి పీల్చుకుని, రాకింగ్ చేర్ లో కూర్చుని చదవని న్యూస్ పేపర్ని చేతిలోకి తీసుకున్నాను. రెండు నిమిషాల్లో డోర్ బెల్ మ్రోగింది. విసుక్కుంటూ లేచి వెళ్ళి తలుపు తీసాను. 'హలో నా పేరు సూసన్. ప్రక్క వీధినించి వస్తున్నాను. మీకు దేవుడు గురించి నాలుగు ముక్కలు చెపుదామని వచ్చాను' అందమైన నవ్వుతో, తియ్యటి కంఠస్వరంతో, ఆపేక్ష నిండిన కళ్ళతో ఎదురుగా నిలుచుంది ఒక మధ్య వయస్కురాలు. 'రెండు నిమిషాలు మీ ఇంట్లోకి రావచ్చా?' ఎంతో నమ్రతగా అడిగింది. 'సారీ ఐయామ్ బిజీ' అన్నాను. 'పోనీ రేపు వస్తాను' అంది. 'చూడండి నాది హిందూమతం. మీ మతం గురించి తెలుసుకోవలసినదంతా నాకు తెలుసు. అంతకంటే నేర్చుకోవాలన్న అభిలాష లేదు నాకు.' వీలున్నంత సున్నితంగా చెప్పాను. ముఖంమీద నవ్వుని చెరుపుకోకుండా అందికదా ఆవిడ, 'మీమతం నిన్ను స్వర్గానికి తీసుకు వెడుతుందా?' 'ఆ తప్పకుండా' అని దభీమని తలుపుసి, 'నేను స్వర్గానికి వెడతానో లేదో కానీ, నువ్వు ఎక్కడికి వెడతావో తెలుసు,' అని మనసులో అనుకుంటూ లోపలికి వచ్చాను. కాఫీ కప్పులో నీళ్ళు నింపి మైక్రోవేవ్ అవెన్ లో విసురుగా పెట్టాను. మళ్ళీ కాలింగ్ బెల్ మోత. నేను అన్నదానికి సమాధానంతోపాటు మళ్ళీ తయారయిందేమో మహాతల్లి. అనుమానంగా పీప్ హోల్ నించి చూసాను. ఆశ్చర్యం. ఎర్రటి పట్టుచీర కట్టుకుని, చలికి ఏకోటు వేసుకోకుండా, లక్ష్మీకళ ఉట్టి పడుతూ ఒక ముత్తైదువు నుంచుని ఉంది. ఆవిడని మునుపెప్పుడు ఇక్కడ చూడలేదు. వెంటనే ఆరు నెలల్క్రితం అత్తగారు రాసిన విషయం గుర్తుకు వచ్చింది. వాళ్ళ దూరపు బంధువులు ఒకళ్ళు ఇక్కడికి ఇమిగ్రేషన్ మీద వస్తున్నారని, వాళ్ళకి సహాయం చెయ్యమని. వాళ్ళే అయివుంటారు. తలుపుతీసి 'నమస్కారమండీ,' అన్నాను. చిరునవ్వుతో లోపలికి అడుగు పెట్టింది ఆవిడ. 'ఒక్కరే వచ్చారా?' నా ప్రశ్న. 'మావారు దింపి వెళ్ళారు. ఒక గంటలో వస్తారు.' అందావిడ. 'నా పేరు సత్య.' మా అత్తగారింట్లో ఇలవేల్పు సత్యనారాయణ స్వామి. పది తరాల వెనకకి వెళ్ళినా ఆడ, మగ, అందరి పేర్లలోనూ సత్య కలుస్తుంది. ఆ విషయమే ఆవిడతో అంటే చిరు నవ్వు నవ్వింది. 'నా పేరు...' అంటూ మొదలెట్టాను. 'నాకు తెలుసు.' అంది చిరు నవ్వుతో. 'మీకో తమాషా చెప్పాలి. నా పెళ్ళైన మర్నాడు భయంభయంగా అందరి మధ్య కూర్చున్నాను. ఇంట్లో పెద్దల్ని పిన్నల్నీ కూడా హనీ అని పిలుస్తుంటే, అబ్బో foreign influence వీళ్ళమీద బాగనే ఉందే. అందర్నీ హనీ అని పిలుచుకుంటున్నారు అనుకున్నా. తరవాత తెలిసింది నాకు వాళ్ళ అందరి పేర్లు హనుమంతరావని.' పొద్దున్నించి ఎంతో ఒంటరితనాన్ని అనుభవిస్తున్నా, నా వాళ్ళంటూ పండగ పూట కనిపించే సరికి మనసులో వున్న ఆలోచనలన్నీ ఒక్కమారు నాలికమీదకి ఉప్పెనలాగ చేరి గలగలా మాటల రూపంలో ప్రవహిస్తున్నాయి. 'హేపీ దీపావళి,' అంటూ ఆవిడని కౌగలించుకున్నాను. అమ్మ కౌగిట్లోని ఆప్యాయతని చవి చూసాను. చెమర్చిన కళ్ళతో ఆవిడని చూస్తున్నాను. ఆవిడ అందాన్ని వర్ణించలేను. 'రండి, కిచెన్ లో కూర్చుని కాఫీ తాగుతూ ఖబుర్లు చెప్పుకుందాం.' అంటూ ఆవిడ చెయ్యి పట్టుకుని వంట గదివైపుకు దారి తీసాను. 'నాకు కాఫీ వద్దమ్మా. పాడి పశువులతో పెరిగినవాళ్ళం, చిక్కటి పాలు ఇయ్యి చాలు' అన్నారు ఆవిడ. పాల గ్లాసు అందిస్తూ మళ్ళీ నా సొద అంతా ఆవిడకి చెప్పుకున్నాను.' చూడండి దీపావళట. ఏముంది ఇక్కడ పండగ. ఒక్క పండక్కి కూడా సెలవుండదు. ప్రతీ పండక్కీ ఇండియాని గురించి తలుచుకుని రోజంతా గడపటం అలవాటయిపోతోంది,' అంటూ వాపోయాను. 'చూడమ్మా ఇలా వచ్చి నాప్రక్కన కూర్చో' అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఆవిడ మాట్లాడుతూంటే నేను ఎక్కడ ఉన్నానో కూడా మరిచిపోయాను. 'చూడు తల్లీ, దీపావళి పండగ ఇండియాలోలా లేదు అని బాధపడటం నీవంటి దానికి తగదు. ఇప్పుడు నీకేం తక్కువ. ప్రేమగా చూసుకునే భర్త. రత్నాల్లాంటి పిల్లలు. అందమైన ఇల్లు, వాకిలీ. ఇండియాలో లేనిదేదో ఇక్కడ దొరుకుతుందని వచ్చారు. వచ్చినందుకు కష్టపడి చక్కటి జీవనశైలిని సృష్టించుకున్నారు. మళ్ళీ ఇక్కడ లేనిదేదో ఇండియాలో ఒరిగిపోతోందని పండగపూట మనస్సుని అల్లకల్లోలం చేసుకోవటం భావ్యమేనా? ఎప్పుడూ నీకు ప్రియమైన మనుష్యులనించి దూరంగా ఉన్నప్పుడు వారిగూరించి తియ్యటి జ్ఞాపకాలే మనస్సులో మెదులుతూ ఉంటాయి. అది మానవ సహజం. దీపావళి నాటి కొత్తబట్టల గురించి ఆలోచిస్తున్నావు. కానీ ఇంటిల్లిపాదికీ ఆ బట్టలు కొనేందుకు తల్లితండ్రులు ఎంత బాధపడేవారో మర్చిపోయావు. మీరందరూ పెద్దవాళ్ళవుతున్నకొద్దీ ఆచారాల పేరిట అల్లుళ్ళ పండగ కోర్కెలు తీర్చేందుకు అత్తమామలు పడే బాధ మర్చిపోయావా? కొన్న టపాకాయలు చాలలేదని గొడవ పెడుతూంటే ఆఖరికి మీ రమ తండ్రి ఏమన్నాడూ? ఇదిగో ఈ పది రూపాయల కాగితానికి ఒక్కసారి నిప్పంటించు. తృప్తిగా ఉంటుంది అన్నాడు. పిల్లలందరూ ఒక్కమారు ఖంగుతిని గప్ చిప్ గా మూల చేరారు. మనసులో ఎంత క్షోభ పడుతూంటే ఆ తండ్రి ఆ మాట అని వుంటాడు. మీ అమ్మ పని మనిషికి ఇచ్చిన చీరని ఆ పండగ పూట తప్ప దాని ఒంటిన మళ్ళీ చూసేదానివా? దాని మొగుడు ఆ చీరని మర్నాడే అమ్మి, తాగి, దాన్ని ఇంట్లోంచి తన్ని తగిలేసేవాడు. మర్చిపోయావా? రోజూ లేని సంతోషాన్ని ఏదో ఆ ఒక్కరోజూ సృష్టించి, పండగని బ్రహ్మాండంగా జరుపుకోవాలనే తాపత్రయం తప్ప అసలు ఆ పండగలోని ప్రాముఖ్యతని ఇండియాలో అందరూ మర్చిపోతున్నారు. దూర దేశాల్లో బ్రతుకుతున్నదానివి, చదువుకున్నదానివి, తెలివిగలదానివి. నువ్వు వేరేగా ఆలోచిస్తున్నావనుకున్నాను. నువ్వూ పైపై మెరుగులు అర్థంలేని ఆచారాల ఊబిలో దిగుతున్నావు. ఇవ్వాళ నీ పిల్లలకి దీపావళి గురించిన కథని వివరించావనుకో. అప్పుడు వాళ్ళేం అడుగుతారో నీకు తెలియదా? నిజంగా నరకాసురుడు వంటి రాక్షసులున్నారా అంటారు. దానికి నీవేం సమాధానం చెప్తావో వినాలని నాకు కుతూహలంగా ఉంది. చెప్పు తల్లీ.'

ఒక్కొక్క మాటే ఆలోచించుకుంటూ నెమ్మదిగా చెప్పుకుపోయాను. 'లేకేం నరకాసురుళ్ళు అప్పటికీ ఇప్పటికీ ఉన్నారు. వాళ్ళని వధించే శక్తి మనకు లేదు. కానీ మనలో ఉన్న అతి భయంకర రాక్షసుణ్ణి, శ్రమిస్తే, మనంతప్పక హతమార్చగలం. ఈర్ష్యా అసూయలు, దురాశ పేరాశలు. మదమత్సరాలవంటి భయంకర రాక్షసులని మట్టిలో కలిపి మన జీవితంలో దీపావళి పండగని ప్రతిరోజూ చేసుకోగలం. ఏనాడైతే అజ్ఞానాన్ని తుద ముట్టించి జ్ఞానదీపాన్ని మన మనస్సులో వెలిగించుకుంటామో ఆనాడే నిజమైన దీపావళి అని నా పిల్లలకి సమాధానం చెప్తాను. అంతేకాదు. అలనాడు సత్యభామ నరకాసురుణ్ణి సంహరించి, స్త్రీ తలిస్తే ఎటువంటి దుర్మార్గుడినైనా అవలీలగా ఓడించగలదన్న నిజాన్ని ఋజువు చేసింది. ఆ నిజాన్ని నిరూపించేందుకే ఆ నీలమేఘశ్యాముడు తన ముద్దులరాణికి ఆ అవకాశాన్ని ఇచ్చాడు. మమ్మీ డాడీ తోపాటు మీరూ సహకరిస్తే మనం ఏ పనైనా సాధించగలం అనికూడా చెప్తాను.' 'చూసావా, అందుకే నిన్ను తెలివిగలదానివి అన్నాను ఇందాక' అంటూ సంతోషంగా చూసింది ఆవిడ నన్ను.

కాలింగ్ బెల్ మోత విని తలుపు తెరిచాను. ఎదురుకుండా ఆజానుబాహువు, నీలవర్ణంకల అతిలోక సుందరుడు చిరు నవ్వులు చిందిస్తూ నిలుచున్నారు. నాకు నోట మాట రాలేదు. బొమ్మలాగ నిలబడిపోయాను.

'వచ్చిన పని అయినట్లేనా వత్సా' అని మర్మగర్భంగా, ఆయన అడిగిన ప్రశ్నకి 'ఆ' అని తృప్తిగా పలికింది ఆవిడ. ఇద్దరికీ పాదాభివందనం చేశాను.

* * * * * * * * * * *

అదిగో 3.30 అయింది. పిల్లలస్కూలుకి బయల్దేరాను. కానీ రోజంతా ఉన్న నిరాశ, నిస్పృహలు లేవు నాలో ఇప్పుడు. మనసు నిర్మలంగా ఉంది. పిల్లలిద్దరూ 'ఆకలి, ఆకలి' అంటూ కారులో ఎక్కారు. కారులోనే వాళ్ళకి పళ్ళరసం, బిస్కట్లు ఇచ్చి అటునించి అటే స్కేటింగ్ క్లాసుకి వెళ్ళాం. శిల్ప కాలు జారి ice మీద పడిపోతే అన్న అనిల్ మరు నిమిషమే దానికి చేయూతనిచ్చి నిలబెట్టాడు. శిల్ప అన్నని కావలించుకుంటోంది. నా కళ్ళు చెమర్చాయి. 'కృష్ణా, వాళ్ళిద్దరి మధ్య ఈ ఆప్యాయతని ఎన్నటికీ చెరగనియ్యకు' అనుకున్నా. అన్నట్లు మరిచిపోయాను మాటల్లోపడి రాత్రికి వంట చెయ్యలేదు నేను. పోనీ, పీట్జావాడికి ఫోన్ చేస్తే ఇంటికి తీసుకు వచ్చి ఇస్తాడు అనుకున్నా. క్లాసునించి తిరిగి ఇంటివైపు దారి తీసాం. చలి, చీకటి. కానీ మనస్సులోమటుకూ ఎంతో ప్రశాంతత.

'మమ్మీ, ఇంటికి క్రిస్టమస్ లైట్స్ ఎందుకు పెట్టావు అప్పుడే.' పిల్లలిద్దరూ కారులోనే గంతులేస్తూ అడిగారు. ఆశ్చర్యంగా చూశాను. నేను లైట్లు ఆన్ చెయ్యలేదే. కారుని గరాజ్‌లో ఆపి త్వరత్వరగా ఇంటి తలుపు తీశాను. ఎదురుకుండా శ్రీవారు 'హేపీ దీపావళీ' అంటూ చిరు నవ్వుతో నించున్నారు. పిల్లలిద్దరికీ కాకరపువ్వొత్తులు, అవే ఎప్పుడూ దొరికే sparklers, నాకు అతి ప్రియమైన పసుపు, ఎరుపు రంగు రోజాలు తీసుకు వచ్చారు. 'పద త్వరగా మద్రాస్ పాలెస్‌లో రిజర్వేషన్ చేశాను, పండగ భోజనం అక్కడ చేద్దాం' అన్నారు వారు. 'అమ్మ దొంగా, వినిపించుకోనట్లే నటించి ఇన్ని ప్లాన్లు వేశారన్నమాట' అంటూ మేడమీదకి వెళ్ళాను చీర కట్టుకునేందుకు.

* * * * * * * * * * *


## A Great Christmas Gift

for your Telugu friends and family

## MAHABHARATAM

in

**Telugu audio** cassettes (7 1/2 hours)
including 45min. of

**BHAGAVAD GITA**

Narrated by **Ashalatha** and sung by
**Vanijayaram, Ramakrishna, Anand and Muralidhar**

* * * **1000s sold** * * *

20 day **SATISFACTION GUARANTEE** or your money back.

only **$19.95** plus $2 s&h
**$5.00 off** (the total) for two or more

Send check payable to Srikanth, SKNV Productions,
5699 Kanan Road #132, Agoura Hills, CA 91367.
(818)346-7743


**MATRIMONIALS..NOVEMBER 1993**

**F93095803:** Alliance invited from well settled, electrical or computer engineer Arya Vysya boy for a fair-good looking, 24 yrs., 5'4½", B.Tech working girl in India.Swagothram-Ananthakula, Uncle's gotram - Elisetla. Pl.cl at (919) 469-4175 and ask for Madhavi.

**M93113702:** Alliance from caring, cheerful, educated ladies in mid 40's for a warm, respectable, professional engineer, very well settled, US Citizen, Widower. Please call (908) 287-3163.

**M93103603:** Correspondence invited for an Andhra Boy, M.S. (Chem. Engg), 35 yrs. 5'7", Greencard holder from cultured Andhra girl.
Please call (908) 422-6787

**M93113802:**Telugu boy, 25 yrs, 5'10", fair, Software Engr. Working as Marktg. Dir. looking for Andhra girl with a college degree. Pl.w.r.to R. Vangara, 150 Wellington Dr.Bloomingdale, IL 60108, P: (708) 307-7686

*******************************

Address for Correspondence:
1 Woodlake Drive, Piscataway, NJ 08854. When responding to this address please send us the particulars of the respondent to be sent to the advertiser. **Please note that TFAS, TJ or any of its members are not responsible for any consequences arising out of this column.**

*******************************

For members of TFAS of good standing (for their immediate family like brothers, sisters daughters and sons) the matrimonial ad appears three consecutive times free of charge. If they would like to continue the ad for three times in a batch a written request has to be made. This is only to avoid repetition for a longer period. For non-members, the ad donation is $5 per insert. **We request the members not to insert on behalf of not-immediate family. Please request them to become members.**

*******************************

**Coding: 1st ltr. M or F. Next two digits: Month in which the ad appeared first. Next two digits: Serial Number, Next digit: No. of times appeared.**

*******************************